ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు..
- ఓటుహక్కు వినియోగించుకున్న యువత
- బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



బెల్లంపల్లి: ఓటు వేయడానికి క్యూలైన్‌లో ఓటర్లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 గంటల నుంచే పట్టభద్రులు ఓటు వేసేందుకు బారులుదీరారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో, ఆర్‌బీహెచ్‌వీ హైస్కూల్‌లో పట్టభద్రులకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ దంపతులు, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఆయన తనయుడు నడిపెల్లి విజిత్ కుమార్‌లు చెన్నూరు నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ దంపతులు ఓటుహక్కు వినియోగించుకున్నారు.

జన్నారం: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్దకు గ్రాడ్యుయేట్, టీచర్ ఓటర్లు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. లక్షెట్టిపేట సీఐ నరేందర్ బూత్‌కు వచ్చి ఓటింగ్ సరళి పరిశీలించారు. సాయంత్రం 4.30 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు జోనల్ ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో గ్రాడ్యుయేట్ పోలింగ్ 62 శాతం, టీచర్ ఎన్నికల పోలింగ్ 92 శాతం జరిగినట్లు తెలిపారు. కాగా ఎన్నికల సరళిని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి పరిశీలించారు.

కోటపల్లి: మండల కేంద్రంలో గురువారం ప్రారంభమైన ఎమ్మెల్సీ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలంలో 482 పట్టభద్రుల ఓట్లు ఉండగా 334 ఓట్లు, (70.12శాతం)పోలైనట్లు అధికారులు తెలిపారు. ఉపాధ్యాయుల్లో 9 ఓట్లకు గాను 9 ఓట్లు పోలయ్యాయని తెలిపారు.

నెన్నెల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓట్లు 391 ఉండగా వీరిలో 217 మంది పురుషులు, 55 మంది స్త్రీలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓట్లు 8 ఉండగా ఏడుగురు ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ సబ్బ రమేశ్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తాండూర్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా సాయంత్రం వరకు ప్రశాంతంగా కొనసాగింది. మండల వ్యాప్తంగా 885 మంది పట్టభద్రులు ఉండగా వీరిలో 614 మంది ఓటర్లు (69.30 శాతం) తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 31 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 29 మంది (80.64 శాతం) ఓట్లు వేశారు. పోలింగ్ కేంద్రాన్ని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పర్యవేక్షించారు. సీఐ కుమారస్వామి, ఎస్సై కిరణ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

చెన్నూర్: చెన్నూర్‌లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. బూత్ నంబర్ 25, 26లలో పట్టభద్రుల ఓటింగ్ నిర్వహించగా 19వ బూత్‌లో ఉపాధ్యాయ ఓటింగ్ నిర్వహించారు. ఇందులో పట్టభద్రుల ఓట్లు 1508 ఉండగా 1106 ఓట్లు పోలు కాగా ఉపాధ్యాయ ఓట్లు 98కి గాను 93 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాన్ని సీఐ రవీందర్ సందర్శించారు.

వేమనపల్లి: మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. 8 మంది ఉపాధ్యాయులకు 8 మంది ఓటు వేయగా, పట్టభద్రులు 167 మందికి 127 మంది 76.04 శాతం ఓటింగ్ నమోదైనట్లు తహసీల్దార్ రమేశ్ తెలిపారు.

దండేపల్లి: ఉపాధ్యాయులు, పట్టాభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 1,848 మంది పట్టభద్రుల ఓటర్లకు 1,291 మంది ఓటు వేయగా 69.9 శాతంగా నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 83 మందికి గాను 79 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాగా దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ కుమార్‌దీపక్ సందర్శించారు. 29 బూత్‌లలో పోలింగ్ సరళి నత్తనడకన సాగడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం నాలుగు గంటలు దాటినా ఓటర్లు బారులు తీరి ఉండటంతో అదనంగా మరో టేబుల్ ఏర్పాటు చేయించారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్ఐ భూమన్న ఎస్సై తహసీనొద్దీన్, ఏఎస్సై రాజేందర్ ఉన్నారు.

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కలెక్టర్ కుమార్‌దీపక్, సీపీ శ్రీనివాసులు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అభ్యర్థి నరేందర్ రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పట్టభద్రులు 74.14శాతం, ఉపాధ్యాయులు 93.4శాతం ఓటుహక్కు వినియోగించుకున్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, సీఐ ఆకుల అశోక్, ఎస్సై గోపతి సురేశ్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మండలంలోని 1,352 మంది పట్టభద్రులకు 1,029 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా 76.10 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 20 మంది ఉండగా 20 మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

మందమర్రిరూరల్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు మందమర్రిలోని సింగరేణి హైస్కూల్‌లో ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్లు 4183 ఉండగా 2471 (59.07%) మంది, ఉపాధ్యాయ ఓటర్లు 215 ఉండగా 221 (97.28%) మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్‌లు గట్టి బందోబస్తు చేపట్టారు. పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన బెల్లంపల్లి ఏసీపీలు సూచనలు చేశారు.

కాసిపేట: మండల కేంద్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 69.95శాతం పట్టభద్రుల ఓట్లు నమోదయ్యాయి. మొత్తం 762 మందికి 533 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రంలో 93.75శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 16మంది ఉపాధ్యాయులకు 15 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకున్నారు.

భీమిని: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ భీమిని, కన్నెపల్లి మండలాల్లో ప్రశాంతంగా ముగిసింది. భీమినిలో పట్టభద్రులు 146 మందికి 106 మంది (72.60 శాతం), కన్నెపల్లిలో 176 మందికి 137 మంది (77.84 శాతం) నమోదైంది. కన్నెపల్లిలో నలుగురు ఉపాధ్యాయులకు నలుగురు, భీమినిలో ఇద్దరికి ఇద్దరు ఓటుహక్కు వినియోగించుకున్నారు.

జైపూర్: జైపూర్ హైస్కూల్‌లో 1095 పట్టభద్రులకు 660 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 25మంది ఉపాధ్యాయులకు 24మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాగా 22వ పోలింగ్ కేంద్రంలో జైపూర్‌కు చెందిన ఆరిగెల మల్లాగౌడ్ ఓటు వేసేందుకు వెళ్లగా తన ఓటును అప్పటికే వేరే వ్యక్తి వేసినట్లుగా ఉండడంతో కొంత గందరగోళం నెలకొంది. ఈ మేరకు అంశంపై విచారణ చేపడుతామని తెలిపి మళ్లీ ఆయనకు ఓటు వేసే అవకాశాన్ని అధికారులు కల్పించారు.

బెల్లంపల్లి: గాడ్యుయేట్స్ ఎన్నికల కోసం బెల్లంపల్లిలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 49వ పోలింగ్ కేంద్రంలో 977 మంది ఓటర్లకు 636 మంది (65.10 శాతం), 50వ పోలింగ్ కేంద్రంలో 811 మంది ఓటర్లు ఉండగా మొత్తం 510 మంది (62.89శాతం), 51వ పోలింగ్ కేంద్రంలో 975 మంది ఓటర్లకు 592 మంది (60.72 శాతం) ఓటుహక్కు వినియోగించుకున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బెల్లంపల్లిలో 28వ పోలింగ్ కేంద్రాన్నీ ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 166 మంది ఓటర్లు ఉండగా 149 మంది ఓట్లు వేశారు. 89.76 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ తీరును మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ, ఏసీపీ ఏ.రవికుమార్ పర్యవేక్షించారు.



కోటపల్లి: ఓటు వేసిన పురాణం సతీశ్‌కుమార్



నెన్నెల: పోలింగ్ కేంద్రం వద్ద బెల్లంపల్లి ఆర్డీవో



హాజీపూర్‌లో..



తాండూర్: పరిశీలిస్తున్న ఏసీపీ రవి కుమార్



చెన్నూర్: ఓటు వేసిన పట్టభద్రులు



దండేపల్లి: మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్



మంచిర్యాలటౌన్: ఓటుహక్కు వినియోగించుకున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ దంపతులు



మందమర్రిరూరల్: ఓటుహక్కు వినియోగించుకున్న యువతులు



జైపూర్: ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు



కాసిపేట: క్యూలో పట్టభద్రులు



జన్నారంలో నాయకులతో నరేందర్ రెడ్డి

క్లుప్తంగా

బండ్లపై పడవలు!



ఎడ్లబండిలో తరలిస్తున్న పడవలు

వేమనపల్లి: నది దాటేందుకు ఎడ్లబండ్లను ఓడలపై ఎక్కించి తరలిస్తుంటాం. గురువారం పడవలను తరలించేందుకు ఎడ్లబండ్లపై ఎక్కించారు మత్స్యకారులు. గత ఆరు నెలలుగా నీల్వాయి ప్రాజెక్టులో చేపల వేట నిలిచిపోయింది. అయితే గురువారం నుంచి చేపలు పట్టేందుకు మత్స్యశాఖ అనుమతి ఇచ్చింది. దీంతో వేమనపల్లి, కల్మలపేట, నీల్వాయికి చెందిన జాలర్లు ప్రాణహిత నది, ఇంటి వద్ద ఉన్న పడవలను నీల్వాయి ప్రాజెక్టుకు ఎడ్లబండ్లల్లో తరలిస్తూ కన్పించారు.

అధికారిపై దాడికి యత్నం.. కేసు నమోదు

భీమారం: మంచిర్యాల అటవీరేంజ్ పరిధిలోని భీమారం మండలం దాంపూర్ బీట్ ప్రాంతంలో రిజర్వు ఫారెస్ట్ నుంచి మంగళవారం రాత్రి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అడ్డుకున్న బీట్ ఆఫీసర్ గడికొప్పుల బానేశ్‌పై దాడికి యత్నించిన బూర్గుపల్లి గ్రామానికి చెందిన బుక్యా రాజ్‌కుమార్‌తోపాటు అతని సోదరులు శ్రీనివాస్, బలరాం, అనిల్, దేవ్, రాజేశ్, ధరావత్ వంశీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత గురువారం తెలిపారు. అటవీశాఖ అధికారి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్‌తో ఢీకొట్టి, దాడికి యత్నించి బలవంతంగా ట్రాక్టర్ తీసుకెళ్లారని ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటర్నేషనల్ ఉగాది సేవా స్ఫూర్తి అవార్డు 2025 కోసం వివిధ రంగాల్లో సేవలు అందించే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్గనైజేషన్ జిల్లా కోఆర్డినేటర్ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిభ, సేవా దృక్పథం ఆధారంగా ఎంపిక ప్ర క్రియ ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు మార్చి నె ల 16వ తేదీలోగా 63029 08528, 93475 69095 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

ఇటు జాతర.. అటు ఎన్నికలు

జైపూర్: ఒక పక్కన వేలాలలో మహాజాతర మరో పక్కన ఎమ్మెల్సీ ఎన్నికలతో మండలంలోని అధికారులు, పోలీసులు ఇబ్బందులు పడ్డారు. వేలాలలో మహాశివరాత్రి సందర్భంగా ఏటా మూడురోజుల పాటు శ్రీ మల్లన్న స్వామి జాతర నిర్వహిస్తారు. గురువారం రెండో రోజున మహాజాతర కొనసాగగా ఆయా ప్రాంతాల నుంచి 4లక్షలకు పైగా భక్తులు తరలివచ్చారు. కాగా మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జైపూర్ హైస్కూల్‌లో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పోలీసులతో పాటు అధికారులు ఇబ్బందులు పడ్డారు.

డబుల్ డ్యూటీ!



బాలుడిని ఎత్తుకున్న కానిస్టేబుల్

దండేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరిగింది. దీంతో ఓ మహిళా పట్టభద్రురాలు కొడుకును ఎత్తుకుని ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చింది. సదరు మహిళ ఓటేసి వచ్చే వరకు గేటు దగ్గర ఓటర్లను క్యూలో నిలబెడుతున్న ఓ కానిస్టేబుల్ బాలుడిని ఎత్తుకుని ఆడిస్తూ, ఓటర్లను క్యూలో పంపిస్తూ డబుల్ డ్యూటీ చేసిన దృశ్యాన్ని ‘సాక్షి’ క్లిక్‌మనిపించింది.

కొనసాగుతున్న కత్తెరసాల జాతర

చెన్నూర్‌రూరల్: మహాశివరాత్రి పురస్కరించుకొని మండలంలోని కత్తెరసాలలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయంలో జాతర కొనసాగుతోంది. గురువారం భక్తులు జాతరకు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తులు బోనాలు పోసి, తీపి పదార్థాలతో స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి స్వామి వారికి బండారు వేసి మొక్కులు తీర్చుకున్నారు.

కబడ్డీ విజేత బూరుగుపల్లి

వేమనపల్లి: మండల కేంద్రంలోని విద్యానిధి పాఠశాల వద్ద దివంగత ప్రధానోపాధ్యాయుడు గాడిపల్లి మధుకర్ స్మారక జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో బూరుగుపల్లి విజేతగా నిలిచింది. తహసీల్దార్ కె.రమేశ్ నిర్వాహకుడు సుధీర్‌కుమార్‌తో కలిసి పోటీలు ప్రారంభించారు. బూరుగుపల్లి విన్నర్‌గా అంకతపల్లి రన్నరప్‌గా నిలిచాయి.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

జన్నారం: మండల కేంద్రంలోని ఈర్లగుట్టపై వెలసిన శ్రీ కేతేశ్వర కంకాలమ్మ ఆలయంలో గురువారం శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగరావు, వైస్‌చైర్మన్ చిలువేరు నర్సయ్య, సభ్యుల ఆధ్వర్యంలో పూజారి భూమన్న చారి కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు రాజన్న, మల్లయ్య, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా పావురాజేశ్వరుడి జాతర

దండేపల్లి: మండలంలోని పెద్దపేట సమీపంలో గల శ్రీపావురాజేశ్వరుడి ఆలయంలో గురువారం నిర్వహించిన జాతర ఘనంగా జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి యాదవ కులస్తులు, సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి రాజేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ సంవత్సరం మహాశివరాత్రి తరువాత రోజున జాతర నిర్వహిస్తారు. కొందరు భక్తులు బెల్లంతో తులాభారం వేసి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లలకు పుట్టువెంట్రుకలు తీశారు. దీంతో ఆలయం వద్ద భక్తుల రద్దీ కనిపించింది.



జాతరలో భక్తులు

పదోన్నతి పొందిన ఏజెంట్‌కు సన్మానం

కాసిపేట: మందమర్రి ఏరియా కెకె గ్రూప్ ఏజెంట్‌గా పనిచేసి జీఎంగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న ఏజెంట్ రాందాసును గురువారం కాసిపేట 1గని అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. గని మేనేజర్ భూశంకరయ్య మాట్లాడుతూ ఉత్తమ అధికారిగా అందరికి అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు చేసి రక్షణ, ఉత్పత్తిలో కృషి చేయడం అభినందనీయమన్నారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఫిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, రక్షణాధికారి నిఖిల్ అయ్యర్, డెప్యూటీ మేనేజర్ వెంకటేశ్, సంక్షేమాధికారి మీర్జాగౌస్, ఐఎన్‌టీయూసీ ప్రచారకార్యదర్శి లక్ష్మణ్‌దాస్, నాయకులు రాజేందర్, రవి, భైరి శంకర్, చొల్లంగి శ్రీనివాస్, దెబ్బటి తిరుపతి, కృష్ణ, తిరుపతి, బానోత్ తిరుపతి తదితరులు ఉన్నారు.



ఏజెంట్‌ను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయంలో శుక్రవారం హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో ముక్త తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా భక్తులు హుండీలో వేసిన కానుకలు, టిక్కెట్ల ఆదాయం, హుండీ ఆదాయం లెక్కింపు ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో ప్రారంభించనున్నట్లు అయన పేర్కొన్నారు.

నీటి సరఫరా నిలిపివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో మరమ్మతుల కారణంగా రెండు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు మంచిర్యాల డివిజన్ డీఈ కే. మధుసూధన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని లక్సెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్, మందమర్రి, జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో ఈ నెల 28 నుంచి మార్చి 1వ తేదీ వరకు సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

పెద్దపులి సంచారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ప్రజలకు అటవీ అధికారులు మరోసారి హెచ్చరికలు చేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నంనూర్, గుడిపేట, ముల్కల ప్రాంతాల శివారు అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తోందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు, మేకల, పశువుల కాపరులు అటవీ ప్రాంతం వైపు వెళ్లవద్దని, అటవీ ప్రాంతాల్లో విద్యుత్ తీగలు ఏర్పాటు వేయవద్దని హెచ్చరించారు.

వాహనాల పట్టివేత

భీమారం: మండల కేంద్రం సమీపంలోని అటవీప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న జేసీబీతోపాటు ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు మంచిర్యాల రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు గురువారం తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తాండూర్: మండల కేంద్రం ఐబీలో గురువారం మోకుదెబ్బ జాతీయ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి భూసారపు మొండిగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ నిర్మాణం పటిష్టం చేసుకుని సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకెళ్లాలని సూచించారు. సంఘం జిల్లా నాయకులు తాళ్లపల్లి శంకర్ గౌడ్, పెరుమాండ్ల భాస్కర్ గౌడ్, పున్నంగౌడ్, నవీన్‌గౌడ్, మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్, సింగిల్ విండో డైరెక్టర్ రత్నాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని శాంతిఖని పునర్వ్యవస్థీకరణలో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మార్చి 6న నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఏరియా కాన్ఫరెన్స్ హాల్లో యూనియన్‌ల నాయకులతో గురువారం ఏరియా జీఎం దేవేందర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం, యూనియన్ నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి మండలం శాంతిఖని గ్రామ పంచాయతీలోని శాంతిఖని పాతమైన్ ఆఫీస్ సమీపంలో ఉదయం 11 గంటలకు ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని తెలిపారు. సమీక్షా సమావేశంలో ఏరియా అధికారులు, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్, సీఐటీయూ, బీఎంఎస్ నాయకులు ఉన్నారు.

‘రెఫరల్ ప్రక్రియ సులభతరం’

శ్రీరాంపూర్: అత్యవసర పరిస్థితిల్లో కంపెనీ ఏరియా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ఇక కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫరల్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా నేరుగా రెఫరల్ చేయనున్నట్లు ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకు ముందు ఆసుపత్రుల్లో ఉన్న రోగి, క్షతగాత్రుడు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, కరీంనగర్ వంటి పట్టణాలకు రెఫరల్ చేయడానికి సదరు వ్యక్తి పని చేసే గని, డిపార్టుమెంట్ నుంచి రెఫరల్ ఫారాల మీద అధికారుల సంతకాలు, ఫొటోలు తీసుకోవాల్సిన అవసరం ఉండేదని, దీంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. దీనికి ఒక్కోసారి అధికారులు అందుబాటులో లేకుంటే రెండు రోజుల సమయం పట్టేదన్నారు. యజమాన్యంతో మాట్లాడి ఈ విధానానికి స్వస్తి పలకాలని కోరామని తెలిపారు. స్పందించిన యజమాన్యం ఇకపై నేరుగా కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫరల్ చేయడానికి ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో రెఫరల్ ప్రక్రియ చాలా సులభతరంగా మారిందని పేర్కొన్నారు.

ట్రేడ్స్‌మెన్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్: ట్రేడ్స్‌మెన్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా తెలిపారు. గురువారం ఆయన ఎస్సార్పీ 3 గనిపై జరిగిన ట్రేడ్స్‌మెన్ల సమావేశంలో మాట్లాడారు. మార్చి 2న సీసీసీ కార్నర్‌లోని నర్సయ్య భవన్‌లో ట్రేడ్స్‌మెన్ సబ్ కమిటీ సమావేశం జరుగుతుందన్నారు. దీనికి పెద్ద సంఖ్యలో ట్రేడ్స్‌మెన్లు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ట్రేడ్స్‌మెన్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం తీర్మానాలు చేస్తామన్నారు. ట్రేడ్స్‌మెన్లు ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోవచ్చని తెలిపారు. గతంలో వారి కోసం ఏఐటీయూసీ పోరాడి అనేక హక్కులు, సదుపాయాలు కల్పించిందని గుర్తు చేశారు. సమావేశంలో ట్రేడ్స్‌మెన్ సబ్ కమిటీ ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, నాయకులు నాగభూషణం, మురళీచౌదరీ, మల్లేశ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్కే బాజీసైదా

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

లక్సెట్టిపేట: మాదిగ హక్కుల దండోరా ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని నాయకులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కుల సాధన లక్ష్యంగా హక్కుల దండోరా సంఘం ఆవిర్భవించి నేటికి నాలుగు సంవత్సరాలు పూర్తయిందన్నారు. హక్కుల పోరాటంలో కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు